పేదలకు వరం సీఎం సహాయనిధి

- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, ఫిబ్రవరి 11: పేద ప్రజలకు వరం సీఎం సహాయనిధి అని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. మల్దకల్ మండలం దాసరిపల్లి గ్రామానికి చెందిన డబ్బన్నకు మెరుగైన చికిత్స కోసం మంజూరైన సీఎం సహాయనిధి రూ.1.5 లక్షల ఎల్‌వోసీని ఆదివారం ఎమ్మెల్యే జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వీరన్న, నాయకులు వెంకటన్న, భరత్‌రెడ్డి, చిన్నరాముడు, నాయకి మధు పాల్గొన్నారు.

సబ్ జూనియర్ జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక

ఆత్మకూరు, ఫిబ్రవరి 11: జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని మూలమల్ల గ్రామంలో 33వ సబ్ జూనియర్ కబడ్డీ జిల్లా జట్ల ఎంపికలు నిర్వహించారు. గ్రామ నాయకురాలు పద్మజా వెంకటేశ్వర్‌రెడ్డి సహకారంతో నిర్వహించిన పోటీలను స్థానిక నాయకుడు నాగరాజుగౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాస్థాయిలో రాణించి రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటాలన్నారు. జిల్లా బాలికల జట్టుకు ఆత్మకూరు, అమరచింత, ఖిల్లాఘన్‌పూర్, వనపర్తి, పెబ్బేర్ మండలాలకు చెందిన క్రీడాకారిణిలు ఎంపిక య్యారు. బాలుర జట్టుకు ఆత్మకూరు, అమరచింత, పెబ్బేర్, శ్రీరంగపూర్ మండలాల క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి రాములు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 16న సూర్యాపేట జి ల్లా చింతలపల్లి మండలం మల్లారెడ్డి గూడెంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్‌రెడ్డి, రఫీక్, వినయ్‌కుమార్‌రెడ్డి, సుధాకర్, మాజీ ఎంపీటీసీ లక్ష్మన్న, సహదేవుడు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పోటీలకు హాజరైన క్రీడాకారులతో నిర్వాహకులు

రైస్‌మిల్లుల్లో విజిలెన్స్ అధికారుల తనిఖీ

మాందాపూర్‌లో మిల్లులో ధాన్యాన్ని తనిఖీ చేస్తున్న రాష్ట్ర విజిలెన్స్ అధికారులు

పాన్‌గల్, ఫిబ్రవరి 11: మండలకేంద్రంలోని పరమేశ్వర రైస్‌మిల్, మాందాపూర్ గ్రామంలోని మీనాక్షి ఫుడ్ ప్రొడక్షన్, ఇషాన్ ఆగ్రో మిల్లుల్లో ఆదివారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యం సకాలంలో ఇవ్వకపోవడం, ప్రభుత్వం ఇచ్చిన వరిధాన్యం బస్తాలు, మిల్లులో నిలువ ఉన్న బస్తాల్లో తేడా ఉండడంతో ఆయా మిల్లులపై గతంలో జిల్లా పౌరసరఫరాల శాఖ కేసులు నమోదు చేశారు. ఇందుకు రైస్ మిల్లు యజమాని పరమేశ్వర్‌రెడ్డి అడ్వకేట్ కౌన్సిల్‌ను ఆశ్రయించి ఆర్డర్ తెచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్, ప్రధాన విజిలెన్స్ అధికారి కల్నల్ ప్రకాశ్ ఆధ్వర్యంలో మిల్లుల్లో ధాన్యం బస్తాల నిల్వలు లెక్కిస్తున్నారు. తుది నివేదిక అందజేస్తామని సివిల్ సప్లై జిల్లా అధికారి శ్రీనాథ్ తెలిపారు.

కొనసాగుతున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

ప్రాక్టికల్ పరీక్షలను పరిశీలిస్తున్న డీఐఈవో మద్దిలేటి

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 11: జిల్లావ్యాప్తంగా ఆదివారం ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు కొనసాగాయి. ఉదయం జరిగిన పరీక్షలో 480 మంది విద్యార్థులకు గాను 461 మంది హాజరుకాగా 19 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 188 మంది విద్యార్థులకు గాను 176 మంది హాజరు కాగా, 12 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 668 మంది విద్యార్థులకు గాను 637 మంది హాజరు కాగా, 31 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలో 458 మందికి గాను 441 మంది విద్యార్థులు హాజరు కాగా 17 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్ విద్య జిల్లాఅధికారి మద్దిలేటి, సీవీ రామన్, రావూస్, మహాత్మా జ్యోతిరావు పూలే కళాశాలల్లోని పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

వాసవీ మాతకు పూజలు

కొత్తకోట, ఫిబ్రవరి 11: వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి 7200 గ్రాముల వెండి తొడుగును అలంకరించారు. అంతకు ముందు మహిళలు భవానీ మాత ఆలయం నుంచి కన్యకా పరమేశ్వరి దేవాలయం వరకు 108 కలశాలతో శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ గుంతమౌనిక, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చంద్రకాంత్, ప్రభాకర్‌శెట్టి, సత్యం, భాస్కర్, నర్సింహ, పట్టాభి, రాజు, శంకర్, విజయ్‌కుమార్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

మల్దకల్, ఫిబ్రవరి 11 : మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయం వరకు గల భక్తి మార్గ్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి ఆదివారం జెడ్పీ చైర్ పర్సన్ సరిత భూమిపూజ చేశారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.40లక్షలతో సీసీ రోడ్డు పనులు చేపడ్తున్నామన్నారు. పనులు నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

మధుర గాయకుడు ఘంటసాల

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 11: తన గాత్రంతో సమాజాన్ని మేల్కొలిపిన మధుర గాయకుడు ఘంటసాల అని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ అన్నారు. ఆదివారం వనపర్తి కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో ఘంటసాల వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో గాయకులు శరవంద, భాస్కర్, రాములు, మురళీశర్మ, చంద్రశేఖర్, గోవిందు, రాజు, రాములుయాదవ్, బండారు శ్రీనివాస్, రాంమోహన్ ఆచారి, ముమ్మళ్ల రాములు, వెంకటేశ్వర్లు, మధు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

గోపాల్‌పేట, ఫిబ్రవరి 11 : మండల కేంద్రంలో ఆదివారం ఎస్సై హరిప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనాలకు సంబంధించిన పేపర్లు, డ్రైవింగ్ లైసెన్స్ వెంట ఉండాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపకూడదని, ద్విచక్ర వాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

బ్రహ్మోత్సవాలకు వేళాయే..

ఉత్తనూరులో బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన ధన్వంతరి వేంకటేశ్వర ఆలయం

- నేటి నుంచి 18 వరకు ఉత్తనూరు ధన్వంతరి వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు
- నేడు శ్రీవారి కల్యాణం, గరుడవాహన సేవ
- 13న ప్రభోత్సవం, హనుమద్వాహన సేవ
- 14న రథోత్సవం, గజవాహనసేవ
- ఏర్పాట్లు పూర్తి చేసిన దేవస్థాన కమిటీ

ధన్వంతరి వేంకటేశ్వర స్వామి మూల విరాట్

అయిజ, ఫిబ్రవరి 11 : ఉత్తనూరు క్షేత్రం భక్తుల ఇలవేల్పుగా పేరుగాంచింది. అయిజ మండలంలోని ఉత్తనూరులో ధన్వంతరి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను ప్రతిఏటా మాఘశుద్ధ తదియ నుంచి మాఘ శుద్ధ సప్తమి వరకు దేవస్థాన కమిటీ కనుల పండువగా నిర్వహిస్తోంది. ఈ ఏడాది బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు దేవస్థాన కమిటీ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే దేవస్థానంలో సకల సౌకర్యాలు కల్పించింది. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఉత్తనూరులోని ధన్వంతరి వేంకటేశ్వర స్వామి ఆలయంతోపాటు, భీమేశ్వరాలయం, ఆంజనేయస్వామి ఆలయం, గోపాలదాసుల వారి నివాసాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. విద్యుద్దీపాలతో అలంకరణ చేస్తున్నారు. సోమవారం నుంచి ఈనెల 18 వరకు బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు.

బ్రహ్మోత్సవాల వివరాలు..

☛ సోమవారం ఉదయం సుప్రభాత సేవ, ధ్వజారోహణం, ఉదయం 6గంటలకు సంతాన ప్రాప్తి కలుగుటకు గరుడ ప్రసాదం అందజేయనున్నారు. రాత్రి 7గంటలకు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా శివరామాచారి, కుమారి దివ్య గద్వాల బృందంచే సంగీత విభావరి, నృత్య ప్రదర్శన, రాత్రి 10గంటలకు శ్రీదేవి, భూదేవిలతో ధన్వంతరి వేంకటేశ్వరస్వామి కల్యాణం, గరుడవాహన సేవ నిర్వహిస్తారు.

☛ 13న మంగళవారం, ఉదయం నిత్యపూజలు, రాత్రి 9గంటలకు ప్రభోత్సవం, హనుమద్వాహన సేవ, అంతర్రాష్ట్ర భజన పోటీలు.

☛ 14న బుధవారం, ఉదయం నిత్యపూజలు, రాత్రి 12.30 గంటలకు రథోత్సవం, గజవాహన సేవ.

☛ 15న నిత్యపూజలు, శేషవాహన సేవ.

☛ 16న నిత్యపూజలు, చక్రస్నానం, ధ్వజారోహణం.

- నేటి నుంచి మిట్ట రామలింగేశ్వర ఆలయంలో ప్రతిష్ఠాపనోత్సవాలు
- 12న మంత్రాలయం పీఠాధిపతి రాక
- 14న గణపతి, నంది, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

విగ్రహ ప్రతిష్ఠాపనకు ఏర్పాట్లు పూర్తి

విగ్రహాల ప్రతిష్ఠాపనకు ముస్తాబైన భ్రమరాంబిక, గుంతరామలింగేశ్వరాలయం

అయిజ, ఫిబ్రవరి 11 : పట్టణంలోని భ్రమరాంబిక, గుంత, మిట్టరామలింగేశ్వరాలయంలో సోమవారం నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో దాదాపు రూ.2కోట్లతో భ్రమరాంబిక, గుంతరామలింగేశ్వరాలయాన్ని పునరుద్ధరించారు. దీంతో ఆలయంలో కొత్తగా గణపతి, భ్రమరాంబిక, నంది, ఆంజనేయ స్వామి, సుబ్రహ్మణ్యస్వామి, సత్యనారాయణస్వామి, రాఘవేంద్రస్వామి, నవగ్రహ విగ్రహాలతోపాటు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన చేయనున్నారు. ఇందుకు ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 12 నుంచి 14వరకు భ్రమరాంబిక, గుంతరామలింగేశ్వరాయంలో కొత్త విగ్రహాలతోపాటు ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన చేపట్టనున్నారు.

12న మంత్రాలయం పీఠాధిపతి రాక

పట్టణంలోని భ్రమరాంబిక, గుంతరామలింగేశ్వరాలయంలో నిర్వహించనున్న ప్రతిష్ఠాపన మహోత్సవాలకు మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుభుదేంద్ర తీర్థులు రానున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి పరమశివుడికి పాత్రులుకావాలని ఆలయ సేవకులు మహేశ్, గోపాల్ రెడ్డి కోరారు.

అంబేద్కర్ యువజన సంఘం గ్రామ కమిటీ ఎన్నిక

ధరూరు, ఫిబ్రవరి 11: మండలంలోని గార్లపాడు గ్రామంలో ఆదివారం అంబేద్కర్ యువజన సంఘం గ్రామ కమిటీని ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు శ్రీనివాసులు తెలిపారు. ఉపాధ్యక్షుడిగా రాజు, ప్రధానకార్యదర్శి గా జనార్దన్, కార్యదర్శిగా శివరాజు, జాయింట్ సెక్రటరీగా జైపా ల్, మీడియా ఇన్‌చార్జిగా రాజు, కోశాధికారిగా ప్రవీణ్, సలహా దారులుగా దావీద్, రమేశ్, రంగస్వామి, రాహుల్, ఆనంద్, జాన్, హనుమంతు, ఇమ్మానియేలు, వెంకటేశ్‌లను ఎన్నుకున్నారు. కార్య క్రమం లో గ్రామ పెద్దలు బుజ్జన్న, ధర్మన్న, బీమన్న, జంగిలన్న, రాజులన్న, తమ్మన్న, మాదేవు, నాగరాజు, రాముడు, రాజు, గోవిందు, లాలు, దేవరాజు, రంగస్వామి, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

గుర్రంగడ్డను సందర్శించిన జములమ్మ ఆలయ ఈవో

గద్వాల రూరల్, ఫిబ్రవరి 11 : నడిగడ్డ ఇలవేల్పు జములమ్మ బ్రహ్మోత్సవాలు ఈనెల 20 నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆదివారం జములమ్మ ఆలయ ఈవో పురేందర్, ఆలయ సిబ్బంది అమ్మవారి పుట్టినిల్లు అయిన గుర్రంగడ్డ గ్రామానికి చేరుకుని అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఈవో పురేందర్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సందర్భంగా అమ్మవారిని తీసుకురావడానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆలయ సిబ్బందికి సూచించారు. అదేవిధంగా ఆలయం వద్ద జరిగే పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట ఆలయ సిబ్బంది సంజీవరెడ్డి, రవిప్రకాశ్ తదితరులు ఉన్నారు.

జిల్లా కార్యవర్గం ఎన్నిక

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 11: జిల్లా కేంద్రంలో ఆదివారం సంత్ సేవాలాల్ సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చంద్రునాయక్, ప్రధాన కార్యదర్శిగా రాధాకృష్ణ, గౌరవాధ్యక్షులుగా సూర్యనాయక్, కృష్ణనాయక్, కోశాధికారిగా రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా కస్నానాయక్, నారాయణ, కృష్ణ, జహంగీర్, జానకీరాం, శంకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

గోపాల్‌పేట, ఫిబ్రవరి 11: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన రేవల్లి మండలం నాగపూర్‌లో చోటు చేసుకున్నది. ఎస్సై తిరుపతిరెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన రైతు దొడ్డి నిరంజన్ (59) శనివారం సాయంత్రం తన పొలంలో సాగు చేసిన మొక్క జొన్న పంట కాపలా కోసం వెళ్లాడు. ఈ క్రమంలో పంటకు నీళ్లు పెట్టేందుకు బోరు వద్దకు వెళ్లగా ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. నిరంజన్ ఉదయం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా , శవమై కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి మృతుడి కుమారుడు దొడ్డి వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బొలెరో వాహనం ఢీకొని ఇద్దరికి గాయాలు

గోపాల్‌పేట, ఫిబ్రవరి 11 : బొలెరో వాహనం ఢీకొని భార్యా భర్తలు గాయపడ్డ ఘటన ఆదివారం రేవల్లి మండలం శానాయిపల్లి గేటు సమీపంలో చోటు చేసుకున్నది. ఎస్సై తిరుపతిరెడ్డి కథనం మేరకు.. బండరావిపాకులకు చెందిన తలారి బాలరాజు భార్య అరుణ బుడ్డల మిషన్‌పై ఎక్కి నాగపూర్ వైపు వస్తుండగా, నాగపూర్ వైపు నుంచి నాగర్‌కర్నూల్ వెళ్లే బొలేరో వాహనం ఢీ కొంది. ఈ ఘటనలో బాలరాజు, అరుణ గాయపడ్డారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గాయపడ్డ వారిని నాగర్‌కర్నూల్ దవాఖానకు తరలించారు. బాలరాజు బంధువు వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రశాంతంగా టీజీసెట్

కస్తూరా పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాసులు

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 11: వనపర్తి జిల్లావ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన తెలంగాణ గురుకుల ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని జిల్లా కో-ఆర్డినేటర్ రవీందర్ తెలిపారు. జిల్లాలో మొత్తం 11 పరీక్షా కేంద్రాల్లో పరీక్షకు 3,777 మంది విద్యార్థులకు గాను 267 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. మదనాపురం కేంద్రంలో 480 మందికి 445, గోపాల్‌పేట గురుకుల కేంద్రంలో 480 మందికి 450, కొత్తకోట గురుకుల పాఠశాలలో 240 మందికి 221, నాగవరం గురుకుల కేంద్రంలో 360 మందికి 339, చిట్యాల గురుకులలో 249 మందికి 236, మర్రికుంట గురుకులంలో 408 మందికి 388, గాయత్రీ పాలిటెక్నిక్ కళాశాలలో 456 మందికి 420, పెబ్బేర్ మోడల్ స్కూల్‌లో 240 మందికి 218, కొత్తకోట మోడల్ స్కూల్‌లో 240 మందికి 216 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. మొత్తం 3,777 మందికి 3,510 మంది విద్యార్థులు హాజరవ్వగా, 267 మంది గైర్హజరైనట్లు ఆయన చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

ఇటిక్యాలలో..

ఇటిక్యాల, ఫిబ్రవరి 11 : గురుకుల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశం కోసం ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మండల సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో 600 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, 563 మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ తిరుపతయ్య తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని గురుకులాల ప్రాంతీయ సమన్వయాధికారి ఫ్లారెన్స్‌రాణి సందర్శించారు.

మదనాపురంలో..

మదనాపురం, ఫిబ్రవరి 11 : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన 5వ తరగతి ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని పాఠశాల ప్రిన్సిపాల్ జీఎస్.రవీందర్ తెలిపారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు పరీక్ష నిర్వహించగా, 480 విద్యార్థులకు గాను 445 మంది హాజరయ్యారని తెలిపారు. పరీక్ష ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన పోలీస్ శాఖకు ప్రిన్సిపాల్ ప్రత్యేక కృజ్ఞతలు తెలిపారు.

కొత్తకోటలో..

కొత్తకోట, ఫిబ్రవరి 11: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 5వ తరగతి అడ్మిషన్ల కోసం ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలోని బాలికల గురుకుల పాఠశాలలో 264 మంది విద్యార్థులకు గాను 238 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ మాలతి తెలిపారు. అలాగే వీపనగండ్ల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 240 మంది విద్యార్థులకు గాను 221 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ దయాకర్ తెలిపారు.

అయిజ గురుకులలో..

ఎర్రవల్లి చౌరస్తా, ఫిబ్రవరి 11 : అయిజ గురుకుల పాఠశాల పరీక్షా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్షకు బాలురు 198, బాలికలు 168 మంది పరీక్షకు హాజరైనట్లు ప్రిన్సిపాల్ రఘు తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని అదనపు కలెక్టర్ శ్రీనివాసులు పరిశీలించారు.

అదనపు కలెక్టర్ తనిఖీ..

గట్టు, ఫిబ్రవరి 11 : మండలంలో నిర్వహిస్తున్న మానవపాడు గురుకుల పాఠశాల పరీక్షా కేంద్రంలో 336మంది విద్యార్థులకుగాను 316మంది, కస్తుర్బా పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో 264మంది విద్యార్థులకు గాను 247మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. కస్తుర్బా కేంద్రాన్ని అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాసులు పరిశీలించారు.

వనపర్తి : పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

చౌడేశ్వరీదేవికి రావుల ప్రత్యేక పూజలు

ఆలయం వద్ద రావుల చంద్రశేఖర్‌రెడ్డి

పెబ్బేరు, ఫిబ్రవరి 11: పట్టణంలోని చౌడేశ్వరీ దేవి అమ్మవారిని ఆదివారం మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి దర్శించుకున్నారు. అమ్మవారి ఉత్సవాలను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారు చల్లనిచూపులతో ప్రజలంతా సంతోషంగా ఉండడంతోపాటు రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్‌చైర్మన్ కర్రెస్వామి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వనం రాములు, నాయకులు రాజశేఖర్, వేణు యాదవ్, గోపిబాబు, గోల్డ్ బాలస్వామి, మజీద్, మాధవరెడ్డి, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో బదిలీ

మల్దకల్, ఫిబ్రవరి 11 : మల్దకల్ ఎంపీడీవో కృష్ణయ్య సిద్దిపేటజిల్లాకు బదిలీ అయ్యారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని మూడేళ్లు పదివీ కాలం ముగిసిన అధికారులను ఎలక్షన్ కమిషన్ ఆదేశానుసారం బదిలీ చేసినట్లు సమాచారం.

ఇటిక్యాలలో..

ఇటిక్యాల, ఫిబ్రవరి 11 : మండల అభివృద్ధి అధికారి రాఘవ వనపర్తి జిల్లాకు బదిలీ అయ్యారు. 26 ఏప్రిల్ 2022 నుంచి ఈయన ఇక్కడ ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వర్తించారు.

అయిజలో..

అయిజ, ఫిబ్రవరి 11 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అయిజ ఎంపీడీవో సాయిప్రకాశ్‌ను నారాయణపేట జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది.

మల్దకల్ ఎస్సైగా సురేశ్‌గౌడ్

మల్దకల్, ఫిబ్రవరి 11 : మల్దకల్ ఎస్సైగా సురేశ్ గౌడ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎస్సై కల్యాణ్‌కుమార్ వనపర్తి జిల్లాకు బదిలీ అయ్యారు. సురేశ్‌గౌడ్ నారాయణపేట జిల్లా మద్దూరు మండలం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవ చేస్తానన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు.

చిన్నంబావి ఎస్సైగా రమేశ్

చిన్నంబావి, ఫిబ్రవరి 11: మండల ఎస్సైగా పబ్బతి రమేశ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పనిచేసిన కృష్ణ ఓబుల్‌రెడ్డి వనపర్తి ఎస్పీ ఆఫీస్‌కు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం ఎస్సైగా పనిచేసిన పబ్బతి రమేశ్ ఇక్కడికి వచ్చారు. అనంతరం స్టేషన్ సిబ్బంది ఎస్సైకి శుభాకాంక్షలు తెలిపారు.

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

అయిజ, ఫిబ్రవరి 11 : వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చుతూ అసెంబ్లీ సమావేశాల్లో బిల్లును ఆమోదించి కేంద్రానికి పంపాలని ఆ సంఘం మండల నాయకుడు పాండురంగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం లో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి 76 ఏండ్లు గడిచినా వడ్డెర బతుకులు మారడం లేదని వాపోయారు. వడ్డెర విద్యార్థులకు గురుకులాల్లో ప్రత్యేక రిజర్వేషన్, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.వెయ్యి కోట్ల బడ్జెట్ కేటాయించాలన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం

వీపనగండ్ల, ఫిబ్రవరి 11: మండల కేంద్రానికి చెందిన చెందిన ఆర్ఎంపీ వైద్యుడు సంజన్న ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆదివారం సంజన్న చిన్ననాటి మిత్రులు,1996-97 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.66.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో రాజు, నాగేశ్, రాముడు, కృష్ణయ్య, మద్దిలేటి, కృష్ణయ్య, ఈశ్వరయ్య, బీరయ్య,తిరుపతయ్య, ఫకీరయ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

పాన్‌గల్, ఫిబ్రవరి 11: సంపూర్ణ పారిశుధ్యానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీవో రాఘురామయ్య అన్నారు. స్పెషల్ శానిటేషన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని అన్నారం, గోప్లాపూర్ గ్రామాల్లో ఆ యన పర్యటించి తాగునీటి ట్యాంకులు, డ్రైనేజీలను పరిశీలించి శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.